సాక్షి
కాకినాడ

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కేవీపీ బాపన్న దంపతులు (హైదరాబాద్) శనివారం రూ.1,00,116 విరాళం అందజేశారు. ఏటా కార్తిక పౌర్ణిమ రోజు తమ తల్లిదండ్రులు సత్యానందం, శేష మాంబ పేరున అన్నదానం చేయాలని కోరారు.



శ్రీవారి ఆలయానికి రూ.2 లక్షలు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆ గ్రామానికి చెందిన పిన్నమని రామకృష్ణ రూ.2 లక్షల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్‌కు అందజేశారు.

ఎలక్కొట్టుడు



ఎలక చిన్నదే.. సాగులో తెచ్చే నష్టం మాత్రం పెద్దది. అసలే ఖరీఫ్ సాగు ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులకు వీటి సమస్య ప్రాణసంకటంగా మారింది.

న్యూస్‌రీల్

ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలి

జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల వినతి



ప్రజా వేదిక వద్ద వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

సామర్లకోట: రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు 010 పద్దు కింద ట్రెజరీల ద్వారా చెల్లించాలని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘ గౌరవాధ్యక్షుడు సలాది సాయిసత్యనారాయణ అన్నారు. శనివారం ముఖ్యమంత్రి పెద్దాపురం నియోజకవర్గ పర్యటనను పురస్కరించుకుని ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదుల స్వీకరణ కేంద్రంలో వినతిపత్రం అందజేసినట్టు ఆయన విలేకర్లకు తెలిపారు. గ్రంథాలయాల ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా చెల్లించడం వల్ల సకాలంలో జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 600 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలిగేలా 010 పద్దు కింద ట్రెజరీల ద్వారా జీతాలు, పెన్షన్లు అందజేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఈ.వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా పంచాయతీరాజ్ వ్యవస్థ

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి వెంకటకృష్ణ



శిక్షణలో పాల్గొన్న ప్రిన్సిపాల్, వివిధ జిల్లాలకు చెందిన ఎంపీడీఓలు

సామర్లకోట: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ప్రజలకు మరింత చేరువగా, పారదర్శంగా మార్చడానికి ఉద్యోగులు పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి కె.వెంకటకృష్ణ అన్నారు. బాపట్ల, సామర్లకోట, శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రంలో గత నెల 28 నుంచి ఉమ్మడి జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసి, గ్రామాలు, మండలాల పాలనలో మార్పు తేవాలన్నారు. అప్పుడే ప్రజల అభివృద్ధి, ఉద్యోగులకు సంతృప్తి కలుగుతుందన్నారు. స్వర్ణ పంచాయతీ, మేరీ పంచాయతీ యాప్‌ల ద్వారా పంచాయతీ రాబడి, ఖర్చులను ప్రజలు నేరుగా తెలుసుకోవచ్చని తెలిపారు. పంచాయతీ సంస్థలను ప్రజలకు అందుబాటులో ఉంచి, వారి అభివృద్ధి, సంక్షేమానికి సంస్కరణలు తీసుకువస్తున్నట్టు వివరించారు. భవిష్యత్తులో శిక్షణలు తప్పనిసరి చేస్తూ ఉద్యోగ నియమావళిలో మార్పు తెస్తామని తెలిపారు. స్థానిక ఈటీసీ ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాదరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, ఫ్యాకల్టీలు శేషబాబు, శర్మ, డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వికాసలో రేపు జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సంస్థ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు శనివారం తెలిపారు. బజాజ్ క్యాపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, టెలికాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వెంకీ రెసిడెన్సీలో స్టీవర్డ్, కెప్టెన్, టెక్నీషియన్, ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రజెంటేటివ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ(మెకానికల్ మెయిన్‌టెనెన్స్), జూనియర్ ఇంజినీర్, సీనియర్ ఇంజినీర్, కెమిస్ట్, సీనియర్ కెమిస్ట్, ఇసుజు, వియాష్ లైఫ్ సైన్సెస్, ఇంజి, డిక్సాన్, హ్యుండాయ్, మోబిస్ కంపెనీల్లో టెక్నీషియన్, ఫాక్స్‌కాన్ కంపెనీలో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్‌లో ఉత్తీర్ణులై, 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయని చెప్పారు. అభ్యర్థులు సోమవారం వికాస కార్యాలయానికి ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల కాపీలతో హాజరుకావాలన్నారు.

విద్యాభంగం



- విద్యార్థుల ఫీజుల మాటేమిటి బాకా బాబు..!
- కాలేజీకి వెళ్లేదెలా.. చదువులు సాగేదెలా?
- గుదిబండగా ఫీజు రీయింబర్స్‌మెంట్
- అప్పులు చేసి కడుతున్న తల్లిదండ్రులు
- బకాయిలు రూ.వంద కోట్లు పైమాటే..
- 41,413 మంది విద్యార్థుల ఎదురుచూపులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: విద్యార్థుల జీవితాలతో చంద్రబాబు సర్కార్ ఆటలాడుకుంటోంది. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా మొండిచేయి చూపిస్తోంది. బకాయిలు రూ.కోట్లలో ఉన్నా చిల్లిగవ్వ కూడా విడుదల చేయకుండా విద్యార్థులను రోడ్డున పడేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల చేయకుండా చంద్రబాబు సర్కార్ విద్యార్థులకు నరకం చూపిస్తోంది. ఫీజుల కోసం కాలేజీ యాజమాన్యాలు పెడుతున్న షరతులతో కాలేజీలకు వెళ్లేదెలా అంటూ విద్యార్థులు కంటతడి పెడుతున్నారు. ఫీజులు చెల్లించాకే కాలేజీలకు రండి అని యాజమాన్యాల ఒత్తిళ్లతో విద్యార్థులు దిక్కులు చూసే పరిస్థితి ఎదురవుతోంది. కాలేజీ యాజమాన్యాలు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ సొమ్ము విడుదల కాకపోవడంతో కాలేజీలు నడపలేకపోతున్నామని మథనపడుతున్నారు. చంద్రబాబు ఒంటెద్దు పోకడలతో పరిస్థితి ఇలానే కొనసాగితే, కాలేజీలు మూతపడే దుస్థితి ఏర్పడుతుందని కాలేజీ యాజమాన్య ప్రతినిధులు మండిపడుతున్నారు. మొత్తం విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి ఒక్క త్రైమాసికానికి చెల్లించి, మిగిలిన మూడు త్రైమాసికాలు ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. కాగా గత విద్యా సంవత్సరానికి మూడు త్రైమాసికాలూ పెండింగ్‌లో ఉన్నాయి. ఇదంతా లెక్కిస్తే.. దాదాపు రూ.వంద కోట్లు పైమాటే ఉంటుందని అంచనా వేస్తున్నారు. విద్యార్థులు నేరుగా చెల్లించిన ఫీజులపై సర్వే పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోంది.

విద్యార్థులపై ఒత్తిళ్లు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత కరవవ్వడంతో పేద, మధ్య తరగతి వర్గాలవారు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు సెమిస్టర్, మిడ్ పరీక్షలు వచ్చిన ప్రతి సందర్భంలోను ఫీజుల కోసం కాలేజీలు ఒత్తిడి చేస్తున్నాయి. మొత్తం ఫీజులు చెల్లించకున్నా, కనీసం సగం ఫీజైనా చెల్లిస్తేనే పరీక్ష రాయిస్తామని కాలేజీలు షరతులు పెడుతున్నాయి. ఇలా ఒకేసారి రూ.50 వేల నుంచి రూ.65 వేలు చెల్లించాలంటే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు తలకు మించిన భారంగా మారింది. ఓ వైపు కాలేజీల ఒత్తిళ్లతో కొందరైతే అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

కాకినాడ జిల్లాలో 2024–25 విద్యా సంవత్సర పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల వివరాలు

కులాల వారీగా..	విద్యార్థులు	ఆర్‌టీఎఫ్ మొత్తం (రూ.కోట్లలో)	ఆర్‌టీఎఫ్ పెండింగ్ (రూ.కోట్లలో)
ఎస్సీ	6,106	6,09,49,165	0
ఎస్టీ	295	59,74,115	0
క్రిస్టియన్ మైనార్టీ	100	15,88,127	14,00,000
ముస్లిం మైనార్టీ	559	76,37,565	68,00,000
బీసీ	19,557	25,47,49,771	21,00,00,000
ఈబీసీ	2,372	4,01,40,833	3,00,00,000
కాపు	12,424	17,33,52,429	12,00,00,000
మొత్తం	41,413	54,43,92,005	36,82,00,000

నోట్: ఆర్‌టీఎఫ్(రీయింబర్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజు)

విద్యార్థుల అవస్థలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు పూర్తి బకాయి చెల్లించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాలని విద్యార్థులకు సూచిస్తున్నాయి. ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్ ఇచ్చేది లేదని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు షరతులు పెడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి విద్య లేదా డిగ్రీ అర్హతతో ఉద్యోగాలు పొందిన వారు సొంతంగా ఫీజు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకెళ్లండి అని యాజమాన్యాలు చెబుతుండటంతో విద్యార్థులు నరకం చూస్తున్నారు.

కాకినాడలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో బీసీఏ కోర్సు అభ్యసించిన విద్యార్థి కలగల సత్తిబాబు(మార్చిన పేరు)కి ఏడాదికి రూ.18 వేల చొప్పున రెండేళ్ల పాటు చెల్లించగా, ఈ విద్యా సంవత్సరంలో చెల్లించలేదు. ఐసెట్‌లో అర్హత సాధించి, ఎంసీఏ కోర్స్ చేయడానికి సర్టిఫికెట్లు అవసరం కావడంతో, సొంతంగా ఫీజు చెల్లించి సర్టిఫికెట్ తీసుకున్నాడు. అదేవిధంగా జేఎన్‌టీయూకే ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థికి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం రావడంతో సంబంధిత కంపెనీ అడిగిన సర్టిఫికెట్ల కోసం ఫీజు మొత్తం చెల్లించి ఉద్యోగంలో చేరాడు. ఇలా విద్య, ఉద్యోగాలకు విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఓవైపు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేశాక చెల్లిస్తామని విద్యార్థుల నుంచి అంగీకార పత్రం తీసుకుని సర్టిఫికెట్లు జారీ చేయమని ఆదేశాలిస్తున్నా.. వాటిని యాజమాన్యాలు ఏమాత్రం పాటించడం లేదు.

ఉత్తుత్తి ఉత్తర్వులు

ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సుల్లో విద్యార్థులకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాల్సి ఉంది. గడచిన ఏడాది కాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తున్నట్టు రెండు పర్యాయాలు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు చూసి ఇంకేముంది సొమ్ములు ఖాతాలకు వచ్చిపడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు, కాలేజీ యాజమాన్యాలు గంపెడాశతో ఎదురుచూశాయి. తీరా అవన్నీ చంద్రబాబు హామీల మాదిరిగానే ఉత్తుత్తి ఉత్వర్వులుగా మిగిలిపోయాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సొమ్ములు మాత్రం విడుదల చేయలేదు.

పథకాలు ఇవ్వలేక..

కల్లబొల్లి మాటలతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అందించే సంక్షేమ పథకాల పేర్లు మార్పు చేసింది తప్పితే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా అందించిన పథకాలను ఇవ్వలేక చేతులెత్తేసింది. అప్పుడే అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటిపోయినా, ఇప్పటికే మూడు త్రైమాసికాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా, విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చింది. ఇలా రూ.కోట్లలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు పూర్తిగా నిలిపివేయడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అధికారంలోకి వస్తే అంతకుమించి ఇస్తామని గొప్పలకు పోయిన చంద్రబాబు.. తీరా గద్దెనెక్కాక ఆ విషయాన్ని గాల్లో కలిపేశారని వారు మండిపడుతున్నారు.

ఇది వరకు క్రమం తప్పకుండా వచ్చేది



నేను ప్రత్తిపాడు నైపుణ్య కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాను. బీఎస్సీ ఫస్టియర్ పూర్తి చేసి రెండో సంవత్సరంలోకి వచ్చాను. నాకు ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జమ కావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పటికీ పడలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడే నేను కళాశాలలో జాయిన్ అయ్యాను. రీయింబర్స్‌మెంట్ సొమ్ము పడకపోవడంతో కాలేజీలో ఫీజు అడుగుతున్నారు. ఫీజు చెల్లించకపోయినా యాజమాన్యం దయతో నన్ను కొనసాగిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమ చేయాలి.

– ద్విభాష్యం ఝాన్సీ ఉమామహేశ్వరి, ప్రత్తిపాడు

ఆఖరి ఏడాది రీయింబర్స్‌మెంట్ రాలేదు



మేము సామాన్య మధ్య తరగతి కుటుంబానికి చెందినవారం. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022–25 మధ్య డిగ్రీ పూర్తి చేశాను. డిగ్రీ ఆఖరి ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో సర్టిఫికెట్లు కళాశాలలో ఉండిపోయాయి. ఫీజు పూర్తిగా చెల్లించిన తరువాతే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించాను. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, ఏదైనా ఉద్యోగానికి దరఖాస్తు చేయాలన్నా డిగ్రీ ప్రొవిజనల్ అడుగుతున్నారు. డబ్బు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోలేని పరిస్థితి నాది.

– మణి శివసంజయ్, కాకినాడ

ఇదే నా చదువుకు ఆధారం



మాది పెద్దాపురం మండలం మర్లావ గ్రామం. వ్యవసాయంపైనే ఆధారపడిన కుటుంబం మాది. తండ్రి సూర్యప్రకాష్ కష్టపడి నన్ను ఇంజినీరింగ్ చదివిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడే చదువుకున్నాను. అప్పుడు ఏ ఇబ్బందీ లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కావడంతో కాలేజీల నుంచి ఒత్తిళ్లు ఎదురవ్వలేదు. ఇప్పుడు ప్రభుత్వం ఇంతవరకు ఫీజుల సొమ్ము విడుదల చేయకపోవడంతో కాలేజీలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి.

– జగటపు శివరామకృష్ణ, మర్లావ, పెద్దాపురం

సత్యదేవుని సన్నిధి.. వరాల పెన్నిధి

- ఘనంగా స్వామివారి జన్మ నక్షత్ర పూజలు
- యాగశాలలో ఆయుష్య హోమం
- ఆలయాన్ని దర్శించిన 20 వేల మంది
- దేవస్థాన ఆదాయం రూ.25 లక్షలు



ఆయుష్య హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు



తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

అన్నవరం: స్వామివారి జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు ఆలయం తెరిచి, స్వామి, అమ్మవార్లకు అర్చకస్వాములు సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల మూలవిరాట్‌లకు, శివలింగానికి పండితులు పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలు తదితర పంచామృతాలతో మహాన్యాశ పూర్వక అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధ భరిత పుష్పాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి పూజించారు. ఉదయం ఏడు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.


ఘనంగా హోమం.. పూర్ణాహుతి

యాగశాలలో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఆయుష్య హోమం ఘనంగా జరిగింది. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, గంగాధరభట్ల శ్రీనివాస్, వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, చిట్టి శివ, ఉపాధ్యాయుల రమేష్, వ్రత పురోహితుడు పాలంకి పట్టాభి తదితరులు కార్యక్రమాలు నిర్వహించారు.

ఊరేగింపు

శనివారం పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. అనంతరం అర్చకులు కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా, మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరిగి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయానికి చేర్చారు. ఇలాఉండగా శనివారం సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి వ్రతాలు వెయ్యి నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. నాలుగు వేల మంది భక్తులకు అన్నదాన పథకంలో భోజనం సౌకర్యం కల్పించారు.

కన్నబాబుకు ముఖ్య నేతల పరామర్శ



కన్నబాబు తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబటి రాంబాబు తదితరులు



శ్రద్ధాంజలి ఘటిస్తున్న వీరభద్రస్వామి, విజయనగరం నేతలు

కాకినాడ రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబును శనివారం పలువురు ముఖ్య నేతలు పరామర్శించారు. కాకినాడ వైద్యనగర్ నివాసంలో కన్నబాబును పరామర్శించి, ఆయన తండ్రి సత్యనారాయణ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పరామర్శించిన వారిలో మాజీ డిప్యూటీ స్పీకర్ కొలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పినిపే విశ్వరూప్, మాజీ ఎంపీ బెల్లాని చంద్రశేఖర్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాజు విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ కంబ రవిబాబు, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, బి.అప్పలనాయుడు, కండుబండి శ్రీనివాసరావు, జోగారావు, విశ్వసరాయి కళావతి, పర్వత ప్రసాద్, వైఎస్సార్ సీపీ స్పోక్ పర్సన్ యనమల నాగార్జున యాదవ్, పోతిన మహేష్ తదితరులు ఉన్నారు. అలాగే కన్నబాబు, ఆయన సోదరుడు కల్యాణ్ కృష్ణను ఉత్తరాంధ్ర నుంచి వచ్చిన పలువురు నేతలు పరామర్శించారు.

ఎస్సీ యువతకు డ్రైవింగ్ శిక్షణ

రాజానగరం: భారీ వాహనాల డ్రైవింగ్‌పై షెడ్యూల్ కులాల యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ అన్నారు. అభ్యర్థులకు 20 ఏళ్ల పైబడి వయసు, లైట్ వెహికల్ లైసెన్స్ ఉండాలన్నారు. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి, వారికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్లో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. దీని కోసం ఈ నెల 27వ తేదీ లోపు కాకినాడలోని ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 76719 49476 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నిరీక్షణకు తెర..



- ఎట్టకేలకు డీఎస్సీ–2025 మెరిట్ లిస్ట్ ప్రకటన
- కటాఫ్ మార్కులపై సర్వత్రా చర్చ
- ఈ నెల 25న సర్టిఫికెట్ల వెరిఫికేషన్?

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ–2025 ఫలితాలను శుక్రవారం రాత్రి ప్రకటించారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మహిళలే పైచేయి సాధించడం గమనార్హం. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో పోస్టులు, జోన్ల వారీగా మెరిట్ జాబితాను పొందుపర్చారు. అందులో మొత్తం 60 కేటగిరీల పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్టులను ఉంచారు.

ర్యాంకులు సాధించిన అభ్యర్థులు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. తమకు వచ్చిన ర్యాంకుకు ఉద్యోగం వస్తుందా? రాదా? అనే మీమాంసను వారు ఎదుర్కొంటున్నారు. పోస్టుల సంఖ్య ఆధారంగా ఓపెన్ కేటగిరీలో ఏ ర్యాంకు వరకూ ఉద్యోగం వస్తుంది.. అలాగే వివిధ రిజర్వేషన్ కేటగిరీల్లో మొదటి ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకూ పోస్టుల ఆధారంగా లెక్కలు వేసుకుంటున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు తమకు చాన్స్ వస్తుందా? రాదా? అనే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు 1:1 నిష్పత్తిలో మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులను పిలిచే అవకాశముంది. ఈ నెల 25వ తేదీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు సమాచారం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

మహిళలదే పైచేయి

డీఎస్సీ 2025 నోటిఫికేషన్‌కు ముందు నుంచే ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యారు. డీఎస్సీకి ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందా? అని ఎదురుచూపులు చూసిన అభ్యర్థులు కాకినాడ, రాజమహేంద్రవరం, కృష్ణా జిల్లా అవనిగడ్డ వంటి ప్రాంతాల్లో డీఎస్సీ పరీక్షకు కోచింగ్ తీసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఉపాధ్యాయ కొలువు సాధించాలనే పట్టుదలతో సన్నద్ధమయ్యారు. ఈ పరీక్షల్లో వివిధ కేటగిరీ పోస్టులకు మహిళలే ఉత్తమ ర్యాంకులు సాధించడం గమనార్హం. ఉదాహరణకు మొదటి 150 ర్యాంకుల్లో 90 మంది మహిళలే కావడం విశేషం. అలాగే అన్ని కేటగిరీ పోస్టుల్లో కూడా మహిళలే అధికంగా ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎస్ఏ ఇంగ్లిష్‌లో మొదటి 23 ర్యాంకుల్లో 13 మంది మహిళలు ఉన్నారు.

మొత్తం 1,241 పోస్టులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జెడ్పీ/ఎంపీపీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ల పరిధిలో 1,241 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 423 కాగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 818 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అధికంగా ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆ తర్వాత సోషల్, బయాలజీ పోస్టులు ఖాళీలు అధికంగా ఉన్నాయి. మిగిలిన సబ్జెక్టులు కేవలం రెండంకెల్లో ఉన్నాయి. ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో ఎస్ఏ (పీఎస్)–3, ఎస్ఏ (బీఎస్)–4, ఎస్ఏ (పీఈ)–1, ఎస్జీటీ పోస్టులు 104 ఖాళీలు ఉన్నాయి.

ఇవి కాకుండా జోన్–2 పరిధిలో ఏపీ రెసిడెన్షియల్, ఏపీ మోడల్ స్కూల్స్, ఏపీ సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్/ట్రైబుల్ (గురుకులం) యాజమాన్య పాఠశాలల్లో 348 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో పీజీటీ–49, టీజీటీ–272, పీడీ–3, పీఈటీ–24 పోస్టులు భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని విభాగాల్లో ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ/జెడ్పీ/ మున్సిపల్ మేనేజ్‌మెంట్లు
ఎస్జీటీ	423
ఎస్ఏ తెలుగు	65
ఎస్ఏ హిందీ	78
ఎస్ఏ ఇంగ్లిష్	95
ఎస్ఏ గణితం	64
ఎస్ఏ పీఎస్	71
ఎస్ఏ బయాలజీ	103
ఎస్ఏ సోషల్	132
ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్	210

కేటగిరి	అభ్యర్థి	మార్కులు	ర్యాంకు
ఎస్ఏ ఇంగ్లిష్	అమలకట్ల వరప్రసాద్	86.46	1
	గొలగాని రాంబాబు	84.38	2
	నిడదవోలు రాజరాజేశ్వరి	83.96	3
ఎస్ఏ హిందీ	లక్ష్మి చిక్కం	84.94	1
	దడాల దుర్గాప్రసాద్	82.73	2
	నేతల నేత్రిఅపర్ణ	81.05	3
ఎస్ఏ సంస్కృతం	ఆకాశం గౌరీష్‌బాబు	69.93	1
	బి.వెంకట సుబ్రహ్మణ్యం	65.57	2
	గొర్తి వెంకటశాస్త్రి	60.67	3
ఎస్ఏ తెలుగు	విత్తనాల వంశీకృష్ణ	90.35196	1
	వేదాంతం నరసింహాచారి	86.95051	2
	కట్టా సత్య హరీష్	86.88907	3
ఎస్ఏ బీఎస్	వత్రిపీఎస్ సన్యాసినాయుడు	88.95280	1
	కె.వెంకటరెడ్డి	85.53268	2
	గెద్దం వెంకటశివప్రసాద్	84.19761	3
ఎస్ఏ మ్యాథ్స్	పక్కుర్తి రామకృష్ణ	87.1662	1
	బేతా ఆర్‌వీవీ సత్యవేణి	87.32963	2
	మామిడి రాంబాబు	85.83529	3
ఎస్ఏ పీఈ	కడిమిశెట్టి అశోక్	89.5	1
	కొల్లు శివకుమార్	89	2
	కలిగితి మణికృష్ణ	87.5	3
ఎస్ఏ పీఎస్	యనమల పంప ప్రసాద్	85.43	1
	తెడ్లపు లీలా శివజ్యోతి	84.14	2
	శివఅమ్మిరాజు చల్లా	83.74	3
ఎస్ఏ సోషల్	పెద్ది గంగానారాయణ	89.83884	1
	సంకాబత్తుల అన్నపూర్ణ	87.00550	2
	జామిశెట్టి సత్యాదేవి	85.94379	3
ఎస్జీటీ తెలుగు	వడగల సూర్యలక్ష్మి	94.56377	1
	కదలి రాజ్‌కిరణ్	93.91215	2
	గాయత్రి తోలేటి	93.50426	3

క్లుప్తంగా

'ఈషా' ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా పోటీలు



వాలీబాల్ క్రీడలో తలపడుతున్న గ్రామీణ యువకులు

కాకినాడ క్రైం: కాకినాడలోని ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడా సంబరం ఆరంభమైంది. స్థానిక ఐడియల్ కళాశాల మైదానంలో ఈషా గ్రామోత్సవంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా కేవలం గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. 120 మందితో కూడిన 20 జట్లు పోటీల్లో సువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. హోరాహోరీ పోరులో నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. పోటీలు ఆదివారంతో ఫైనల్స్‌కు చేరుకుంటాయి. ఆదివారం మహిళల త్రోబాల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్‌లో గెలిస్తే రూ.5 లక్షల రివార్డు అందిస్తారన్నారు.

శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్‌కు అభినందన



విజయ్ ప్రకాష్‌ను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం అభినందించారు. పెద్దాపురం పర్యటనకు వచ్చిన ఆయనను కలసి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీరో పావర్టీ పీ–4లో భాగంగా వజ్రపు వీరలక్ష్మి కుటుంబాన్ని విజయ్‌ప్రకాష్ దత్తత తీసుకోవడంతో చంద్రబాబు అభినందించారు. కలెక్టర్ షణ్మోహన్ సగిలితో పాటు పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి మృతి

పెరవలి: ఉసులుమర్రులో ఓ యువకుడు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పెరవలి ఎస్సై వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. నరసాపురం గ్రామానికి చెందిన బొర్రా తరుణ్ (20) డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుండగా, అమ్మమ్మ ఊరైన ఉసులుమర్రుకు 21న వచ్చాడు. ఏమైందో ఏమో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో ఉరివేసుకున్నాడని, పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.

ఎలకొట్టుడు



- పంటలపై మూషికాల దాడి
- పిలక దశలో ధ్వంసం
- నివారణకు అధికారుల చర్యలు శూన్యం
- ఆందోళనలో అన్నదాతలు

ఆలమూరు: ఎలక చిన్నదే.. సాగులో తెచ్చే నష్టం మాత్రం పెద్దది. అసలే ఖరీఫ్ సాగు ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆందోళనలో ఉన్న రైతులకు ఈ సమస్య ప్రాణసంకటంగా మారింది. ప్రస్తుతం పిలక దశలో ఉన్న వరి పంటపై మూషికాల దాడి అధికమైంది. ఒకపక్క ప్రకృతి వైపరీత్యాలు, మరోపక్క ప్రతికూల పరిస్థితులు, ఇంకోపక్క ముషికాల బెడద కలవరపాటుకు గురిచేస్తోంది. ప్రారంభ దశలోనే ఇలా ఉంటే పంట చేతి కొచ్చే సమయానికి మరింత నష్టాన్ని చేకూర్చుతాయని రైతన్నల్లో ఆందోళన నెలకొంది. సమస్య పరిష్కారానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇంకా బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేయకపోవడంతో రైతులను మనోవేదనకు గురిచేస్తుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 1.64 లక్షల ఎకరాల్లో సుమారు 1.40 లక్షల మంది రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. అందులో సుమారు 70 శాతం మేర వెదజల్లు సాగు చేపట్టగా, మిగిలిన పొలాల్లో సాధారణ పద్ధతిలో వరి నాట్లు వేశారు. ఈ సీజన్‌లో రైతులు అధిక విస్తీర్ణంలో స్వర్ణ (ఎంటీయూ 1318), తక్కువ విస్తీర్ణంలో ఎంటీయూ 7,029, విత్తనాల కోసం బొండాలు (ఎంటీయూ 3,626), పీఆర్ 126, ఎంటీయూ 1121 రకాన్ని సాగు చేస్తున్నారు.

ఇంకా స్పందించక..

ఖరీఫ్, రబీ సీజన్లలో ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ ఏటా బ్రోమోడయోలిన్ మందును నూకలు, నూనె మిశ్రమంతో కలిపి రైతులకు ఉచితంగా సరఫరా చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభం కాకపోవడంతో పంట పొలాల్లో మూషికాల బెడద ఎక్కువై పంటను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోంది. పంట పొలాల్లో ఎలుకలు తినేదాని కన్నా దాదాపు పది రెట్లు పంటను పాడుచేసే అవకాశం ఉంది. దీంతో పిలక దశలోనే ఎలుకలను నిర్మూలిస్తే చిరు పొట్ట దశకు చేరుకునే సరికి వరి పంటకు సంబంధించి నష్ట నివారణకు దోహదపడుతుందని అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ స్పందించి ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును త్వరితగతిన పంపిణీ చేయాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతుంది.



ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు (ఫైల్)



బ్రోమోడయోలిన్ మందు మిశ్రమాన్ని కలుపుతున్న రైతులు (ఫైల్)

ఇదో అదనపు ఖర్చు

పంట పొలాలను నాశనం చేస్తున్న ఎలుకలను సంప్రదాయ పద్ధతిలో పట్టించేందుకు అధిక ఖర్చు అవుతుంది. చిలుకలు పండ్లను కొరికి పడేసినట్టు ఎలుకలు వరి దుబ్బులను కొరకడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. వరి పంటను పూర్తి స్థాయిలో రక్షించాలనుకునేందుకు ఖర్చుకు వెనకాడని పరిస్థితి ఉంది. అందులో భాగంగానే బుట్టల సహాయంతో, పొగపెట్టే విధానంతో ఎలుకలను మట్టుబెట్టే చర్యలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఒక ఎకరం భూమిలో సరాసరి సుమారు 50 ఎలుకలకు పైగా పట్టివేత జరుగుతుండగా, ఒక్కొక్క ఎలుకకు కార్మికులు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో ఎకరాకు ఎలుకల నివారణకే రూ.మూడు వేల వరకూ ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. ఎలుకల బెడద ఎక్కువగా ఉండడంతో వాటిని పట్టేవారికి అదే స్థాయిలో డిమాండ్ కూడా ఉంది.

సామూహిక నివారణ సాధ్యమేనా!

వ్యవసాయ శాఖ ఏటా పంపిణీ చేసే బ్రోమోడయోలిన్ మందు సకాలంలో పంపిణీ చేసి రైతులను ఆదుకోవడం సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా పంట పొలాల్లో అధిక భాగం ఎలుకలను నిర్మూలించేందుకు అవకాశం ఉన్నందున ఆ మేరకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అయితే బ్రోమోడయోలిన్ మందును ఇంకా పంపిణీ చేయలేదు. ఈ నేపథ్యంలో సామూహిక ఎలుకల నివారణ సాధ్యమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

మూషికాల బెడద నివారిస్తాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట పొలాల్లో ఎలుకల బెడద అధికంగా ఉందని గుర్తించాం. అందులో భాగంగా మూషికాల బెడదను నివారించి రైతులకు స్వాంతన చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలుకల ఉధృతిని నివారించేందుకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు సరఫరా చేయబోతున్నాం. అలాగే ఎలుకల నిర్మూలనకు పూర్వ సంప్రదాయ రీతికి అనుగుణంగా ఎలుకల కన్నాల్లో పొగను నింపి నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్‌కేవీ చౌదరి, వ్యవసాయ సహాయ సంచాలకుడు, ఆలమూరు

సమగ్ర మార్పులతో కొత్త బార్ విధానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణ, వ్యాపార పరిపాలనలో సమగ్ర మార్పులు తీసుకు రావడమే లక్ష్యంగా కొత్త బార్ విధానం తీసుకు వచ్చిందని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో కొత్త బార్ పాలసీ, నవోదయం 2.0 పనితీరుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ దేవ్‌శర్మ మాట్లాడుతూ ఈ పాలసీ బార్ లైసెన్సుల మంజూరులో ఆన్‌లైన్ విధానం, ఎంపిక ప్రక్రియలో సమానత్వం పాటిస్తామన్నారు. ఏపీ వ్యాప్తంగా 840 బార్లు ఉండగా, దీనిలో ఇకపై వాటిలో పది శాతం కల్లు గీత కార్మికులకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ ఫీజులు 70 నుంచి 50 శాతానికి తగ్గాయని వివరించారు. ఇందులో భాగంగా 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభాకు రూ.55 లక్షలు, 5 లక్షలపైన జనాభా ఉంటే రూ.75 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందని అన్నారు. ప్రతి ఏడాది పది శాతం చొప్పున ఫీజులు పెంచుతామన్నారు. గతంలో బార్లు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉండేవని, ఇక ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అనుమతి ఉంటుందని అన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 28న కలెక్టర్ లాటరీ తీసి బార్లు కేటాయిస్తారని, సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రజా ఆరోగ్యం, సమాజ శ్రేయస్సు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా సారా వ్యాపారం చేసేవారిపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. మూడు కన్నా ఎక్కువ సారా కేసుల్లో ఉన్నవారిపై పీడీ యాక్ట్ విధించేలా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు తమ తమ కార్యాలయాల్లో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, సీనియర్ అధికారులతో రాత్రిపూట గస్తీ చేయాలని ఆదేశించారు. సారా వినియోగంతో అనర్థాలపై ప్రచారం చేయాలన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాల్లో విస్తృత దాడులు చేపట్టి సారా రహిత జిల్లాలుగా ప్రకటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చైతన్య మురళీ, అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఎక్సైజ్ జిల్లా అధికారులు చింతాడ లావణ్య, ఎస్కే వీడీ ప్రసాద్, ఏఈఎస్‌లు నాగరాహుల్, రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఒరిగిన పిల్లర్ సరిచేసేందుకు కాంట్రాక్ట్ ఖరారు

రూ.కోటితో ముంబయి సంస్థకు పనుల అప్పగింత



దిండి - చించినాడ వద్ద వశిష్ట నదిలో ఒరిగిన రైల్వే వంతెన పిల్లర్

మలికిపురం: కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌లో భాగంగా దిండి– చించినాడ వద్ద వశిష్ట నది మధ్య నిర్మించిన రైల్వే వంతెనలో ఒక పిల్లర్ సుమారు రెండు నెలల కిందట ఒరిగిన సంగతి పాఠకులకు విదితమే. ఈ పిల్లర్‌ను సరి చేసేందుకు ముంబయి కంపెనీకి కాంట్రాక్టు ఖరారు అయ్యింది. ఈ వారంలోనే పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, వరదల వల్ల వాయిదా పడింది. వరద తగ్గిన తరువాత పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. నదిలో ఓ వైపునకు 45 డిగ్రీల మేర ఒరిగిన ఈ వంతెన పిల్లర్‌ను తిరిగి యథాస్థానంలో ఉంచేందుకు ముంబయి కంపెనీ ఈ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇప్పటికే ఈ సంస్థ ప్రతినిధులు, ఇంజినీర్లు ఒరిగిన పిల్లర్ పరిస్థితిని అధ్యయనం చేశారు. దీనిని సరి చేయడానికి దాదాపు రూ. కోటి వరకూ ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనాతో కాంట్రాక్టు ఖరారైనట్లు ఆ వర్గాలు తెలిపారు. ఈ ఖర్చు అంతా కూడా ప్రస్తుత కాంట్రాక్టర్ భరించాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వంతెన నిర్మాణంలో ఆఖరు పిల్లరు ఇది భూ గర్భంలోకి వెళ్లే సమయంలో బురద బ్లో అవుట్ సంభవించి ఒరిగిపోయింది. స్థానిక కాంట్రాక్టు ఇంజినీర్లు అప్రమత్తమై రైల్వే ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. దీంతో వారి సూచనల మేరకు డిజైన్ చేసి పిల్లర్ సరిచేసి యథాస్థానంలో ఉంచే విధంగా ప్రణాళిక రూపకల్పన చేశారు. ఈ మేరకు అనుభవం ఉన్న ముంబయి కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. సుమారు 23 మీటర్ల ఎత్తు గల ఈ పిల్లర్ నదిలో ఒరిగిపోయింది. నదిలో మరో 50 మీటర్ల లోతు వరకూ వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఈ 23 మీటర్ల పిల్లర్ నిర్మాణానికి ఇప్పటి వరకూ దాదాపు రూ. 5 కోట్ల ఖర్చు అయ్యింది.

వైకుంఠవాసా.. శ్రీవేంకటేశా..



వాడపల్లి క్షేత్రంలో భక్తజన సందోహం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు వాడపల్లి బాట పట్టారు. పావన గౌతమీ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. తర్వాత స్వామివారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఏడు శనివారాల వెంకన్న దర్శనం నోము ఆచరించే భక్తులు మాఢ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. వైకుంఠవాసా.. శ్రీవేంకటేశా.. గోవిందా.. గోవిందా.. అంటూ ముందుకు సాగారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి స్వామివారికి వివిధ సేవలు నిర్వహించారు. వివిధ సుగంధ భరిత పుష్పాలతో స్వామివారిని కన్నుల పండువగా అలంకరించారు. దేవస్థానం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఇతర అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవల ద్వారా ఈ ఒక్కరోజు సాయంత్రం 4 గంటల వరకూ దేవస్థానానికి రూ.55,60,552 ఆదాయం వచ్చిందని ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్‌ఐ ఎస్. రాము ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏపీఎస్ ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి వాడపల్లి ఆలయానికి బస్సు సర్వీసులను నడిపింది.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ మృతి



కూచిపూడి బుల్లారావు (ఫైల్)

దేవరపల్లి: గుండుగొలను – కొవ్వూరు ప్రధాన రహదారిలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రామన్నపాలెం పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు కూచిపూడి బుల్లారావు(71) దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక పెట్రోల్ బంకులో పెట్రోలు కొట్టించుకోవడానికి బైక్‌పై వెళ్తున్న సర్పంచ్ కూచిపూడి బుల్లారావును ఎదురుగా వస్తున్న క్వారీ టిప్పర్ లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. బుల్లారావు తలపై నుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. సర్పంచ్ బుల్లారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.